క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న సాయిబాబా

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలో కొలువైన షిర్డీసాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబాను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం నక్షత్ర హారతి వేడుక అత్యంత కోలాహలంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా కీర్తనలు ఆలపిస్తూ హారతులు ఇచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విళ్ల సత్యనారాయణ రావు ఏర్పాట్లు చేశారు.

ప్రతి ఒక్కరిలోనూ జ్ఞానజ్యోతి



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి

మల్కాపురం: ప్రతి ఒక్కరిలోనూ అత్యంత ప్రకాశవంతమైన జ్ఞానజ్యోతి ఉందని, దీనిని వ్యాపింపచేయడం వల్ల ప్రపంచ శాంతిని సాధించగలమని ఆధ్యాత్మిక వేత శ్రీజయంత్ దేశ్‌పాండే అన్నారు. 14వ వరల్డ్ చానల్స్ డే సందర్భంగా మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మానవ ఫౌండేషన్ సౌజన్యంతో గురువారం లైట్ చానల్ ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, కళాశాల ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి తదితరులు మాట్లాడుతూ శాంతి ద్వారా మనిషి పొందే విజయాల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' శిబిరాలతో ఎంతో మేలు

కంచరపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం 48వ వార్డు ఊర్వశి కూడలి బర్మాక్యాంప్ పరిధిలోని ఇందిరానగర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. 348 మంది స్థానికులు వైద్య సేవలు పొందారు. వీరిలో నలుగురిని ఆరోగ్యశ్రీ కింద మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. పలువురు రోగులకు ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సి.హరిష్మా చంద్ మాట్లాడుతూ ప్రస్తుతం పలు ప్రాంతాల్లో జ్వరాలతో ప్రజలు బాధపడుతున్న నేపథ్యంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. శిబిరంలో వైద్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బీసీలను గుర్తించే రాజకీయ పార్టీలకే మద్దతు

దాబాగార్డెన్స్: బీసీలను గుర్తించే రాజకీయ పార్టీలకే మా మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు తెలిపారు. నగరంలోని బీసీ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎన్నికల సమయంలో బీసీలను వాడుకుంటున్న ఆయా రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పేలా, రాజ్యాధికారమే లక్ష్యంగా అన్ని బీసీ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి, రాబోయే ఎన్నికల్లో సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు ఏ రాజకీయ పార్టీ సముచిత స్థానం కల్పించి పదవులు కేటాయిస్తుందో వారికే మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర పొలిటికల్ జేఏసీ కన్వీనర్ గొర్లె శ్రీనివాసనాయుడు, కర్రి ధనుంజయనాయుడు, పల్ల రమణ, కామన వెంకట సుబ్బారావు, ప్రసాద్, పల్లి శ్రీనివాసనాయుడు, సంసద్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేకువనే వెలుగురేఖలు



కేజీహెచ్‌లో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న బుచ్చిరాజుపాలెం-1 వలంటీర్ ఉష



బుచ్చిరాజుపాలెం-1లో వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న సచివాలయ కన్వీనర్ సన్యాసిరావు

సూరీడు ఉదయించక ముందే ఇంటి వద్దకు వచ్చి ఆత్మబంధువు ఆప్యాయంగా పిలిచే రోజు.. ఒకటో తారీఖు.. గడప వద్దకు వచ్చి పింఛన్లు అందించే రోజు.. అమ్మో ఒకటో తేదీ అనే రోజు నుంచి హమ్మయ్య ఒకటో తేదీ వచ్చిందని సంబరపడే రోజులొచ్చాయని లబ్ధిదారులు ఆనందంగా చెబుతున్నారు. తమ ఇళ్లలో వేకువనే వెలుగురేఖలు విచ్చుకుంటున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- తెల్లవారుజామునే ఇంటింటికీ వెళ్లి రూ.3 వేల పింఛన్ అందజేత
- లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం

విశాఖ విద్య: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ గురువారం నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ప్రారంభమైంది. వేకువజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు రూ.3 వేలు అందజేశారు. ఉద్యోగుల కంటే ముందుగా.. ఒకటో తేదీనే ఠంఛన్‌గా పింఛన్ సొమ్ము చేతికందటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

మాటిచ్చారు.. పింఛన్ పెంచారు

జీవీఎంసీ 52వ వార్డులో పలువురు లబ్ధిదారులకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట మేరకు పింఛన్ రూ.3 వేలకు పెంచడంతోపాటు, ఒకటో తారీఖునే డబ్బులు చేతికందించేలా ఏర్పాట్లు చేశారన్నారు. అవ్వాతాతల కళ్లలో ఆనందం చూడాలనే ఉన్నత సంకల్పంతో సామాజిక పింఛన్లు ప్రతీ ఏటా పెంచుతూ వచ్చారని చెప్పారు.

కేజీహెచ్‌కు వెళ్లి అందజేత

జీవీఎంసీ 90వ వార్డులో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ డబ్బులు అందజేశారు. బుచ్చిరాజుపాలెం-1 సచివాలయం పరిధిలో గాలివిల్లి వరలక్ష్మి, రావాడ వెంకటరావు అనే వృద్ధులు కేజీహెచ్‌లో చికిత్సలు పొందుతున్నారు. వలంటీర్ వరబల ఉషశ్రీ వారి వద్దకు వెళ్లి పింఛన్ అందజేశారు. తమ వద్దకు వచ్చిన పెన్షన్ సొమ్ము ఇవ్వడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. బుచ్చిరాజుపాలెం-1 పరిధిలో వలంటీర్ ఉష, సచివాలయ కన్వీనర్ సన్యాసిరావు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు.

తొలి రోజు 73శాతం పంపిణీ

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలో ఒకటో తేదీనే సుమారు 73 శాతానికి పైగా పింఛన్లు పంపిణీ చేశారు. పలు వార్డుల్లో వలంటీర్లతో పాటు వైఎస్సార్ సీపీ నేతలు కూడా హాజరై ఈ పండగలో పాలు పంచుకున్నారు. కొందరు వలంటీర్లు ఆస్పత్రిలో ఉన్నవారికి సైతం పింఛన్లు అందించడంతో లబ్ధిదారులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో గురువారం వేకువజామునే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. 58వ వార్డు పిలకవానిపాలెం, గుల్లలపాలెం తదితర ప్రాంతాల్లో ఆయా ప్రాంతాల వార్డు వలంటీర్లు సూర్యుడు ఉదయించక ముందే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి రూ.3 వేలు అందించారు. అలాగే 59, 60, 61 వార్డుల పరిధిలో ఆయా వలంటీర్లు సామాజిక పెన్షన్లు అందజేశారు.



చిన్న బుచ్చిరాజుపాలెంలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేతలు



వేకువజాము 5 గంటలకే వృద్ధుడికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ కళ

మర్యాదపూర్వక కలయిక

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారిగా బాధ్యతలు చేపట్టిన పి.మురళీధర్‌ను గురువారం మద్దిలపాలెం డాక్టర్ వీఎస్.కృష్ణా జూనియర్ కాలేజీ అధ్యాపక బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో సత్కరించారు. విద్యార్థుల అభ్యున్నతికి అంతా సమన్వయంతో పనిచేద్దామని ఆర్ఐవో మురళీధర్ వారికి సూచించారు. ఆర్ఐవోను సత్కరించిన వారిలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు మురళీకృష్ణ, హేమంత్‌కుమార్, వేదవ్యాస్, గోవిందరావు, ఆర్.పి.నాయుడు, సన్యాసిరావు, రాజశేఖర్‌రెడ్డి, సూర్యకుమారి ఉన్నారు.



ఆర్ఐవో మురళీధర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

నిరాశ్రయులకు అండగా జీవీఎంసీ షెల్టర్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ నిరాశ్రయులకు అండగా నిలుస్తోంది. గుంటూరు చెందిన ఓ కుటుంబానికి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తెలిపిన వివరాలిలా.. గుంటూరుకు చెందిన రేవతిని తన భర్త రెండేళ్ల కిందట వదిలేయడంతో అప్పటి నుంచి ఆమె చాలా చోట్ల ఆశ్రయం కోసం తిరిగింది. పని కోసం వెతికితే ఎక్కడా దొరకలేదు. అయోమయ స్థితిలో కూతురితోపాటు విశాఖపట్నం వచ్చి రైల్వే స్టేషన్‌లో ఉండగా.. రేవతి పరిస్థితి గమనించిన ఓ దుకాణం యజమాని బుచ్చిరాజుపాలెం షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమతకు సమాచారం అందించారు. ఆమె వెంటనే స్పందించి రేవతిని, పాపని బుచ్చిరాజుపాలెం షెల్టర్‌కి తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. పాప చదువు గురించి ఆలోచించి వారిని ఆరాధన చిల్డ్రన్స్ హోమ్‌కు అప్పగించారు. ఆశ్రయం కల్పించి తన జీవితానికి ఒక మార్గం చూపించినందుకు షెల్టర్ మేనేజర్ మమతకు రేవతి ధన్యవాదాలు తెలిపారు.



రేవతిని ఆశ్రమానికి తీసుకొచ్చిన మమత

9న డీ వార్మింగ్ డే

మహారాణిపేట: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న నిర్వహించే డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు కోరారు. రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాల బాలికలకు అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజున స్కూళ్లకు హాజరుకాని పిల్లలకు 16న మాత్రలు అందించాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.ప్రశాంతి మాట్లాడుతూ డీ వార్మింగ్ మాత్రలు వేసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు వుండవన్నారు. కార్యక్రమాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా నిర్వహించాలని సూచించారు. కన్సల్టెంట్ హీనా దీక్షిత్, శాంతి ప్రియ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

ఆకట్టుకున్న కెమికల్ ఎక్స్‌పో

పరవాడ: విశాఖ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఏర్పాటు చేసిన వైజాగ్ ఫార్మా ల్యాబ్ కెమికల్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను బీయా స్పెషాలిటీ ప్రొడక్ట్స్ ప్రెసిడెంట్ అనంత్ బర్భాదికర్ గురువారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో జాతీయ, అంతర్జాతీయ ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు స్టాళ్లను ఏర్పాటు చేసి తమ తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ఈ స్టాళ్లు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బర్భాదికర్ మాట్లాడుతూ ఇక్కడ నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో 125 జాతీయ, అంతర్జాతీయ ఔషధ పరిశ్రమల స్టాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్ మూడు రోజుల పాటు జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఫార్మా పరిశ్రమలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా బర్భాదికర్‌కు ఫార్మా పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ శ్రావణ్ షిప్పింగ్ చైర్మన్ జి.సాంబశివరావు, లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు, లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వి.లక్ష్మణరావు, సియాంక ఫ్యూటికల్స్ డైరెక్టర్, ముచ్చువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్(ఎంపీఎస్ఆర్ఎం) కార్యదర్శి జెట్టి సుబ్బారావు, వెర్దంతి లైఫ్ సైన్సెస్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఎం.శివరామప్రసాద్, ఎగ్జిబిషన్ డైరెక్టర్ అజిత్‌కుమార్ శుక్లా పాల్గొన్నారు.



ఎక్స్‌పోలో వివిధ పరిశ్రమల యాజమాన్యాలు ఏర్పాటు చేసిన స్టాళ్లు

శ్రీ విద్య స్కూల్‌లో విద్యార్థిపై టీచర్ దాడి

మధురవాడ: విశాఖ రూరల్ మండలం పరిధి మధురవాడలోని శ్రీ విద్య స్కూల్‌లో ఓ టీచర్ విద్యార్థి తలపై రక్తం వచ్చేలా కొట్టారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం బయటకు పొక్కడంతో సదరు విద్యార్థి తల్లిదండ్రులపై స్కూల్ యాజమాన్యం ఒత్తిడి తీసుకొచ్చి రాజీ చేసినట్టు తెలిసింది. ఈ విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి కూడా వెళ్లింది. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా క్రమశిక్షణ, ఎక్కువ మార్కుల పేరుతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్న ఘటనలు ఇటీవల వెలుగు చూస్తున్నాయి.

16వ పోలీస్ బెటాలియన్‌లో భారీగా బదిలీలు



బక్కన్నపాలెం పోలీస్ శిక్షణ కేంద్రం నుంచి బదిలీ అయిన అధికారులతో కమాండెంట్ గౌతమీ సాలి

పీఎం పాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్‌పీ పోలీస్ శిక్షణ కేంద్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 25 మంది అధికారులు బదిలీ అయ్యారు. బెటాలియన్ అదనపు కమాండెంట్ పి.శ్యామ్యూల్, పలువురు అసిస్టెంట్ కమాండెట్లు రాష్ట్రంలోని వివిధ ఏపీఎస్‌పీ బెటాలియన్లకు బదిలీ అయ్యారు. వీరందరినీ స్థానిక 16వ బెటాలియన్ కమాండెంట్ ఎంఎస్ గౌతమీ సాలి గురువారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.ఎలియా సాగర్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు



ఇద్దరు నిందితులు, గంజాయితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విజయవాడ రైల్వే జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రాహుల్‌దేవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావుల ఆదేశాలతో విశాఖ రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు నేతృత్వంలో పలు బృందాలను ఏర్పాటు చేసి రైల్వేస్టేషన్‌లో నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. గురువారం విశాఖ రైల్వేస్టేషన్‌లో అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వినయ్‌శ్రావణ్‌కుమార్, జగదీష్ అనే యువకుల బ్యాగులను తనిఖీ చేయగా వీరి వద్ద సుమారు 5.9 కేజీల గంజాయి పట్టుబడింది. దీనిని విశాఖ నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అక్రమ రవాణా చేస్తున్నట్లు వీరు తెలిపారు. గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. తనిఖీల్లో జీఆర్పీ ఎస్ఐ బాలాజీరావు, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడారి తులసీరావుకు ఘన నివాళి

మల్కాపురం: విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావు జయంతి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గురువారం యలమంచిలిలోని తులసీరావు ఘాట్ వద్దకు వెళ్లి ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 40, 62 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణ్‌రావు, పలు వార్డుల పార్టీ అధ్యక్షులు ఆడారి హరీష్, రేవళ్ల సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ విశాఖ డెయిరీ అభివృద్ధికి, డెయిరీ కార్మికుల సంక్షేమానికి ఆడారి తులసీరావు అందించిన సేవలను కొనియాడారు.



ఆడారి తులసీరావు ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న బద్రీనాథ్ తదితరులు

మానవత్వం చాటుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు సపర్యలు

మల్కాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళకు వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి శరగడం పత్నీరావు సేవలందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలిలా.. అనకాపల్లి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో ఓ మహిళ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఆమెను రాసుకుంటూ వెళ్లింది. దీంతో ఆ మహిళ సర్వీస్ రోడ్డుపై వాహనంతో సహా పడిపోయి సహాయం కోసం రోధించింది. ఆ సమయంలో అనకాపల్లి నుంచి గాజువాక వైపు కారులో వస్తున్న వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి పత్నీరావు ఆమె పరిస్థితిని చూసి సపర్యలు చేశారు. 108కు, ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. అనకాపల్లి ట్రాఫిక్ పోలీసులు అక్కడికి వచ్చి ఆమె వివరాలు సేకరించారు. అనకాపల్లి సమీప ప్రాంతానికి చెందిన చిట్టితల్లి అనే మహిళ సొంత పనుల నిమిత్తం లంకెలపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా.. హైవే సర్వీస్ రోడ్డులో ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. పత్నీరావు ఆమెను 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. చిట్టితల్లి కుటుంబ సభ్యులు వచ్చే వరకు అక్కడే ఉండి ఆమెకు సేవలందించారు.



గాయపడిన చిట్టితల్లిని ఆస్పత్రిలో చేర్పించిన శరగడం పత్నీరావు

కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

గోపాలపట్నం: కంచరపాలెం ట్రాఫిక్ సీఐగా అమిటి ప్రసాదరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వాసుదేవరావు, సిబ్బంది ఆయనకు సాదర స్వాగతం పలికారు. 2009లో ఎస్ఐగా విధుల్లో చేరిన ప్రసాదరావు పరవాడ, పద్మనాభం మండలాల్లో లా అండ్ ఆర్డర్ విభాగంలో పని చేశారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాలో ఇంటిలిజెన్స్ విభాగంలో, నగరంలో స్పెషల్ బ్రాంచ్‌లో పని చేసి ప్రమోషన్‌పై సీఐగా కంచరపాలెం ట్రాఫిక్ విభాగానికి వచ్చారు. ఇప్పటి వరకు పని చేసిన మళ్ల అప్పారావుకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.



ప్రసాదరావుకు అభినందనలు తెలుపుతున్న సీఐ అప్పారావు, ఎస్ఐ వాసుదేవరావు, సిబ్బంది

డాల్ఫిన్ హిల్స్ పరిశీలన

పెదగంట్యాడ: మిలాన్-2024ను పురస్కరించుకుని యారాడ ప్రాంతంలోని డాల్ఫిన్ హిల్స్, యారాడ బీచ్ తదితర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, నేవల్ కమాండర్ సివిల్ మిలిటరీ లైజన్ ఆఫీసర్ కిశోర్‌తో కలిసి యారాడ ప్రాంతంలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మిలాన్-2024 సందర్భంగా 50 దేశాల ప్రతినిధులు, అతిథులు, నేవల్ అధికారులు అధిక సంఖ్యలో రానున్నారని డాల్ఫిన్ హిల్స్ నుంచి యారాడ బీచ్ వరకూ హెల్త్ ట్రెక్, యోగా తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఆయా ప్రదేశాల్లో త్వరితగతంగా పారిశుధ్య పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్-6 జోనల్ కమిషనర్ సింహాచలం, ఈఈ రామ్మోహన్‌రావు, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



యారాడ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, అదనపు కమిషనర్ విశ్వనాథన్

దేశ ఐక్యతకు జాతీయభాష దోహదం

డీఆర్‌డీవో శాస్త్రవేత్త, డైరెక్టర్ జనరల్ డాక్టర్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధిలో రాజభాష హిందీ ఎంతగానో దోహదపడుతోందని డిఫెన్స్ టెక్నాలజీ రంగ నిపుణుడు, డీఆర్‌డీవో విశిష్ట శాస్త్రవేత్త డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. డీఆర్‌డీవో హైదరాబాద్ క్లస్టర్ పరిధి అఖిల భారత సంయుక్త రాజ్‌భాషా సైంటిఫిక్ అండ్ టెక్నాలజీ రెండు రోజుల సెమినార్ ఎన్ఎస్‌టీఎల్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభూమికి, జాతీయ భాషకు సేవ చేయాలని కోరారు. దేశం ఐక్యంగా వుండాలంటే మాధ్యమంగా హిందీభాష అవసరమన్నారు. శాస్త్రీయ ఆలోచనలు, సాంకేతికతను ప్రచారం చేయడంలో జాతీయ భాష దోహదపడుతుందన్నారు. ఐఎన్ఎస్ చీఫ్ జనరల్ మేనేజర్ పిజు నవేరా మాట్లాడుతూ దేశం సరిహద్దులు సురక్షితంగా వుంచడంలో డీఆర్‌డీవో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఇందులో సాకేతికత పోషించే పాత్రను వివరించారు. హిందీ భాషలో ఈ సెమినార్ నిర్వహించడం గొప్ప విషయమన్నారు. డీఆర్‌డీవో హెడ్ క్వార్టర్స్ డైరెక్టర్ (రాజభాష) డాక్టర్ రవీంద్ర సింగ్ మాట్లాడుతూ శాస్త్రీయ సమాజంలో హిందీ భాషను ప్రోత్సహించడం, అందుకు చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ భారత నౌకాదళం కోసం అత్యాధునిక ఆయుధాలు అభివృద్ధి చేయడంలో ఎన్ఎస్‌టీఎల్ ప్రముఖ పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఇక్కడ రూపుదిద్దుకున్న పలు ఆయుధాల సాంకేతికతను వివరించారు. ఈ సందర్భంగా సెమినార్‌లో పాల్గొన్న ప్రతినిధులు తమ ఆలోచనలు ఆవిష్కరించారు. అనంతరం సావనీర్ ఆవిష్కరించారు. ఆహుతులకు డైరెక్టర్ అబ్రహం వర్గీస్ జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో సెమినార్ చైర్మన్ జీసీ కేదార్‌నాథ్, కో ఆర్డినేటర్ వివేక్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



డీఆర్‌డీవో డీజీ శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్

వాల్తేర్ డివిజన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ గురువారం రెండో రోజు వాల్తేర్ డివిజన్ పరిధిలోని ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌తో కలిసి పర్యటించారు. అక్కడ జరగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. మహిళా సిబ్బంది, అధికారులు, సిబ్బందితో జీఎం ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎలక్ట్రికల్ లోకోషెడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రో మేగ్నటిక్ క్రాక్ డిటెక్షన్ యూనిట్, ఎయిర్‌డ్రైయిర్ టెస్ట్ బెంచ్, లోకో బాడీ వాషింగ్, క్లీనింగ్ యూనిట్‌లను ప్రారంభించారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో ఎంపికైన అమృత్ స్టేషన్స్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో డివిజన్ పరిధిలో జరుగుతున్న డబ్లింగ్, ట్రిబ్లింగ్ పనులపై జీఎం సమీక్షించారు. పర్యటనలో డీఆర్ఎంతోపాటు డివిజనల్ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎలక్ట్రికల్ లోకోషెడ్ వద్ద మహిళా సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం మనోజ్ శర్మ

విద్యార్థులతో డీఈవో మాటామంతీ

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం డీఈవో చంద్రకళ ఆకస్మిక తనిఖీలు చేశారు. మధ్యాహ్నం స్కూల్‌ను సందర్శించిన ఆమె 8వ తరగతి క్లాస్ రూంకు వెళ్లి విద్యార్థులకు ఇచ్చిన బైజ్యూస్ ట్యాబ్‌లను పరిశీలించారు. కొంత మంది ట్యాబ్ తీసుకురాకపోవడంతో మందలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్యాబ్ తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. గణిత పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను ఆమె ప్రశంసించారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



8వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ